# ఏ క్షణంలోనైనా బద్దలవ్వొచ్చు.. నేపాల్‌కు చైనా మరోసారి హెచ్చరిక

ఢిల్లీ: నేపాల్-టిబెట్ సరిహద్దులో హిమనీనదం కూలిపోవడంతో ఏర్పడిన కృత్రిమ సరస్సు (బ్యారియర్ లేక్) ఏ క్షణంలోనైనా బద్దలయ్యే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌ను మరోసారి హెచ్చరించారు. ఈ సరస్సు గట్టు తెగితే భారీగా వరద నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే అవకాశం ఉందని అప్రమత్తం చేశారు. అయితే, తాజా అంచనాల ప్రకారం తక్షణ ముప్పు కాస్త తగ్గిందని, పరిస్థితి కొంత అదుపులోకి వచ్చిందని కూడా వారు వెల్లడించారు. బుధవారం అత్యంత ఎత్తులో ఉన్న ఒక హిమనీనదం విస్ఫోటనం చెందడంతో ఈ ప్రళయం సంభవించింది. ఈ దుర్ఘటనలో భారీగా రాళ్లు, మంచు, బురద కొట్టుకువచ్చి నదీ ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో ఈ సహజ ఆనకట్ట ఏర్పడింది. దీనివల్ల గైరాంగ్ సరిహద్దు క్రాసింగ్, భోటే కోశి, త్రిశూలి నదీ వ్యవస్థల పరిధిలోని ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో నేపాల్ విదేశాంగ శాఖకు చైనా అధికారులు ఒక సందేశం పంపారు. సరస్సులోని నీటి రంగు క్రమంగా ముదురు రంగులోకి మారుతోందని, ఇది ఆనకట్ట ఏ క్షణంలోనైనా బద్దలవడానికి సంకేతం కావచ్చని పేర్కొన్నారు. శుక్రవారం నాటికి సరస్సులో సుమారు 2.5 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని అంచనా వేశారు. ఒకవేళ ఆనకట్ట పాక్షికంగా బద్దలైతే, సెకనుకు 500 క్యూబిక్ మీటర్ల వేగంతో ప్రవాహం ఉండవచ్చని, ఇది నది గట్లకే పరిమితం అవుతుందని తెలిపారు. అయితే, ఆ తర్వాత చైనా అధికారులు మరో తాజా సమాచారం అందించారు. సరస్సు ఉపరితల వైశాల్యం తగ్గిందని, దీంతో వరద ముప్పు కాస్త తగ్గిందని వారు స్పష్టం చేశారు. ఈ అంచనాతో తాత్కాలికంగా నిలిపివేసిన సహాయక చర్యలను పునఃప్రారంభించారు. అధికారులు డ్రోన్లు, శాటిలైట్ల సహాయంతో పరిస్థితిని నిరంతరం గమనిస్తున్నారు. దీనికి ఎగువన మరో పెద్ద నీటి వనరును కూడా గుర్తించి, దాని కదలికలను కూడా పర్యవేక్షిస్తున్నారు. ఈ విపత్తు కారణంగా సరిహద్దుకు ఇరువైపులా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వెయ్యి మందికి పైగా గల్లంతయ్యారు. మృతుల్లో చాలా మంది విదేశీయులు కూడా ఉన్నారు. ప్రతికూల వాతావరణం, మళ్లీ వరదలు రావచ్చన్న ఆందోళనల మధ్య సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

## రూ.22,000 కోట్ల అప్పు.. అయినా తగ్గను, మళ్లీ పైకి లేస్తా

ఢిల్లీ: ఒకప్పుడు దేశ మీడియా రంగాన్ని శాసించిన ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర, తాను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దాదాపు రూ.22,006 కోట్ల రుణాలకు గాను కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేలా నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదించిన రుణ పరిష్కార ప్రణాళిక నేపథ్యంలో ఆయన ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. రుణదాతలకు దాదాపు 99.97 శాతం నష్టం వాటిల్లుతున్న ఈ తరుణంలో, తన భవిష్యత్ ప్రణాళికలను ఆయన ధైర్యంగా ప్రకటించారు. "నేను సర్వస్వం కోల్పోయిన వ్యక్తిగా మాట్లాడటం లేదు. నా దగ్గర మిగిలిన చివరి రూ.6.5 కోట్లు కూడా ఆమోదించిన ప్లాన్ ప్రకారమే చెల్లించాల్సి ఉంటుంది. నాకు ఒక చిన్న ఇల్లు ఉంది, దానిని అద్దెకిచ్చి వచ్చే ఆదాయంతోనే నా ఖర్చులు వెళ్లదీస్తున్నాను. నాకేమీ పశ్చాత్తాపం లేదు. నేను మళ్లీ సంపాదిస్తాను. నేను ఒక మార్గదర్శకుడిని. కొత్త విషయాలను ఎలా ప్రారంభించాలో నాకు తెలుసు, ఆ పని కొనసాగిస్తాను" అని 75 ఏళ్ల సుభాష్ చంద్ర తన వీడియో సందేశంలో వివరించారు. ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్‌గా మీడియా నుంచి మౌలిక సదుపాయాలు, అమ్యూజ్‌మెంట్ పార్కుల వరకు ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. ఇప్పుడు తన తదుపరి ప్రణాళికల గురించి మాట్లాడుతూ, స్విట్జర్లాండ్‌లో కొత్త పని చేయనున్నట్లు తెలిపారు. "ప్రస్తుతం, స్విట్జర్లాండ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ రంగంలో పనిచేసే నా స్నేహితులతో కలిసి పనిచేయాలని ఆలోచిస్తున్నాను. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఒకటి రెండు వారాల్లో వెల్లడిస్తాను. అలాగే, కొన్ని స్టార్టప్‌లను ముందుకు నడిపించేందుకు నా కుటుంబం నుంచి రూ.2-4 కోట్ల వరకు అప్పు తీసుకునే అవకాశం కూడా ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ఎన్‌సీఎల్‌టీ ఆమోదించిన ప్రణాళిక ప్రకారం, రుణదాతలు క్లెయిమ్ చేసిన రూ.22,006.57 కోట్లకు బదులుగా కేవలం రూ.6.5 కోట్లు మాత్రమే పంపిణీకి అందుబాటులో ఉంటాయి. ఇది రుణదాతలకు భారీ నష్టాన్ని మిగిల్చినప్పటికీ, సుభాష్ చంద్ర మాత్రం ఆత్మవిశ్వాసంతో కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం గమనార్హం.

## గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు: ఏపీ గ్రీన్ కమిటీ చైర్మన్ నాగబాబు

అమరావతి: ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని, తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని స్పష్టం చేశారు. హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందనవంలో నిర్వహించిన 'అశ్వత్థ నారాయణ వివాహం' కార్యక్రమంలో నాగబాబు తన అర్ధాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావి-వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు తనకు ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం, రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా, వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ హిమశైలజ తదితర అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

ఢిల్లీ: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో వేగంగా మారుతున్న ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వాసులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల తీవ్రత సెప్టెంబర్ 2 వరకు కొనసాగే అవకాశం ఉందని, ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, రాజధాని హైదరాబాద్‌లో రానున్న 24 గంటల్లో ఆకాశం దట్టంగా మేఘావృతమై అప్పుడప్పుడు వాన చినుకులు పడే అవకాశం ఉందన్నారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని... చెట్లు, భారీ విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద నిలబడ వద్దని హెచ్చరించారు. వర్షం కురుస్తున్న సమయాల్లో వాహనదారులు ప్రయాణాల్లో వేగాన్ని తగ్గించి జాగరూకతతో వాహనాలు నడపాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

## తెలంగాణలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో టీచర్లకు ప్రత్యేక టెట్

హైదరాబాద్: తెలంగాణలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఈ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక టెట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,983 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షలను ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 9:00 గంటల నుంచి 11:30 వరకు, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 4:30 వరకు వివిధ సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. సెప్టెంబర్ 8న పేపర్-1, పేపర్-2 (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 9వ తేదీన మిగిలిన మాధ్యమాలకు సంబంధించిన పేపర్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ, సంబంధిత పాఠశాలల్లో పనిచేస్తూ, ఇప్పటికీ నిర్దేశిత అర్హత ప్రమాణాలను సాధించని ఉపాధ్యాయుల కోసమే ఈ ప్రత్యేక టెట్‌ను నిర్వహిస్తున్నారు. హాల్ టికెట్లు, ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ schooledu.telangana.gov.in సందర్శించాలని విద్యాశాఖ సూచించింది.

## సర్ పై ఎన్నికల సంఘానికి రేవంత్ రెడ్డి లేఖ

గస్టు 3న సర్వే పూర్తి కాగానే ఓటరు డ్రాఫ్ట్ జాబితా ఆగస్టు 10న ప్రచురించనున్నట్లు అని తెలిపింది

హైదరాబాద్: సర్ ప్రక్రియపై కేంద్రఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి ( శనివారం) లేఖ రాశారు. ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువులు పొడిగించాలని కోరారు. మరో నాలుగు వారాల పాటు ఈ గడువును పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వాటితో పాటు తుది ఓటర్ల జాబితా గడువునూ పెంచాలని కోరారు. 73.39 లక్షల ఓటర్ల ఎంట్రీలు సర్ జాబితాలోకి వెళ్లాయని దీంతో తాత్కాలికంగా వెళ్లిన వారిని సైతం శాశ్వతంగా తరలివెళ్లినట్లు పరిగణించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లు నోటీసులకు స్పందించేందుకు ఓటర్లకు సమయం ఇవ్వాలని సూచించారు. ఓటర్ల జాబితాలో అర్హుల ఓట్లు తొలిగిపోకుండా చూడాల్సిన అవకాశం ఉందని ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. కాగా రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువును ఇదివరకే కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఆగస్టు మూడు వరకూ పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 3న సర్వే పూర్తి కాగానే ఓటరు డ్రాఫ్ట్ జాబితా ఆగస్టు 10న ప్రచురించనున్నట్లు అని తెలిపింది. అభ్యంతరాల స్వీకరణ ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకూ గడువుగా పేర్కొంది. చివరగా అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించించనుంది. ఈ నేపథ్యంలో మరోసారి గడువు పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు.

# వరద నీటిపై స్పష్టత ఉండాలి.. బలమైన వాదనలు వినిపించండి

వరద లేకుండానే ఆంధ్రప్రదేశ్ మళ్లించినపుడు కోల్పోయే విద్యుత్తుకు పరిహారం కోరే అంశాన్ని, దీనిని ట్రైబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడం గురించి ఆలోచించాలని న్యాయవాద బృందానికి, ఇంజినీర్లకు సీఎం సూచించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 2014 కంటే ముందు మంజూరైన ప్రాజెక్టుల వివరాలన్నీ తయారు చేయాలని ఇంజినీర్లను సీఎం ఆదేశించారు. తెలంగాణకు జరిగిన అన్యాయం, బేసిన్ పరిధిని పరిగణనలోకి తీసుకొని నీటిని పంపిణీ చేయమని గట్టిగా కోరడం, కృష్ణా ట్రైబ్యునల్-1, కృష్ణా ట్రైబ్యునల్-2 కలిపి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 1050 టీఎంసీలు, పోలవరం ద్వారా తరలించే 45 టీఎంసీల్లో 71 శాతం వాటా కోరాలని, ఆంధ్రప్రదేశ్ బేసిన్ బయటి ప్రాజెక్టులకే 325 టీఎంసీలు మళ్లిస్తుందని, బేసిన్‌లోని ప్రాజెక్టులకే ఎక్కువ నీటిని కేటాయించాలని, పంట నీటి అవసరాలను శాస్త్రీయంగా అంచనా వేసి ట్రైబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. టీఓఆర్‌ను సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ దాఖలు చేసిన కేసు, కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించాలని ఏపీ దాఖలు చేసిన కేసు, కృష్ణా ట్రైబ్యునల్-2ను నోటిఫై చేయాలని వేసిన కేసులు, కర్ణాటకలోని అప్పర్ భద్ర, అప్పర్‌తుంగ ప్రాజెక్టులకు అనుమతులివ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన కేసు, పోలవరం-నల్లమలసాగర్/బనకచెర్ల నీటిమళ్లింపును వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన కేసుల గురించి ముఖ్యమంత్రి, మంత్రి న్యాయవాదులు, అధికారులతో వివరంగా చర్చించారు.

కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట మన అవసరాలు చెప్పండి

కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట తెలంగాణ నీటి అవసరాలకు తగ్గట్లుగా బలమైన వాదనలు వినిపించాలని, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై ఎక్కువ దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలోని కరవు, ఫ్లోరైడ్, వెనకబడిన ప్రాంతాల్లో ప్రజల సాగు, తాగునీటి అవసరాలను ఆధారాలతో చూపి వాదించాలని కోరారు. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన 811 టీఎంసీలపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని, తర్వాత కృష్ణా ట్రైబ్యునల్-2 కేటాయించిన నీటిపై కసరత్తు ముమ్మరం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలు, కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట వాదనలు, సుప్రీంకోర్టులో కేసులు తదితర అంశాలపై ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో చర్చించిన ముఖ్యాంశాలిలా ఉన్నాయి. మొదట ట్రైబ్యునల్ ఎదుట వాదనలు, సుప్రీంకోర్టులో కేసులు, ప్రస్తుత పరిస్థితి గురించి సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వివరించారు. పునర్విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు, తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు వినియోగం, తర్వాత మొత్తం కేటాయింపుపై విచారణకు కేంద్రం జారీ చేసిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్), దీనిపై ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసు, బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ 65 శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన కేటాయింపులు, దీనిపై సుప్రీంకోర్టులో కేసు కారణంగా తీర్పు నోటిఫై కాకపోవడం గురించి చెప్పారు.

### సెప్టెంబరు 16-18 వరకు తెలంగాణ వాదనలు

2023 అక్టోబరు 6న కేంద్రం జారీ చేసిన తదుపరి టీఓఆర్ ప్రకారం తుది వాదనలు జరుగుతున్నాయని, ఆంధ్రప్రదేశ్ వాదనలు ఆగస్టు 13న ముగియగా, తెలంగాణ తరఫున రిజాయిండర్ వాదనలు 14న జరిగాయని, సెప్టెంబరు 16-18 వరకు జరిగే ట్రైబ్యునల్ సమావేశాల్లో తెలంగాణ తదుపరి వాదనలు వినిపించాల్సి ఉందని న్యాయవాదులు వివరించారు. బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీలు కేటాయించగా.. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ 65 శాతం, సరాసరి నీటి లభ్యతతో చేసిన కేటాయింపులతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1050 టీఎంసీలున్నాయి. అయితే బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పును ఇంకా నోటిఫై చేయనందున మొదట బచావత్ కేటాయించిన 811 టీఎంసీల్లో ఎక్కువ వాటా, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై దృష్టి కేంద్రీకరించాలని న్యాయవాదుల బృందానికి, అంతర్రాష్ట్ర జల వనరుల విభాగం ఇంజినీర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ కేటాయింపులను మనం వ్యతిరేకించి సుప్రీంకోర్టుకు వెళ్తే, అమలు చేయాలని కర్ణాటక కోరుతుందని, ప్రస్తుత లక్ష్యం 811 టీఎంసీలేనని స్పష్టం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు అమలైతే కృష్ణా నదీ యాజమాన్యబోర్డు మనుగడ కూడా ఉండదని, ట్రైబ్యునల్ సిఫార్సు చేసిన పర్యవేక్షణ బోర్డు ఉంటుందని, దీనిని కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

# పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్..

అమరావతి: "జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్-1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు.

మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

### మరో మూడుసార్లు గెలవాలి

రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు. తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

### జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి

జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.


## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు: సీఎం చంద్రబాబు

అమరావతి: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఒక పటిష్ఠమైన వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు అరకులోయ మండలం గన్నెలలో ఆయన పర్యటించి, పలు 'ఆరోగ్య రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన దుస్థితి ఉండకూడదన్నదే తన సంకల్పమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'సంజీవని' కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవలతో పాటు కనెక్టివిటీకి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తంలోనే అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించారని గుర్తుచేశారు. ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకే భోగాపురంలో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. గిరిజన బిడ్డలు థింసా నృత్యంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## తెలుగు భాష, లిపిని భావితరాలకు సజీవంగా అందించాలి

అమరావతి: 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించిన మన తెలుగు భాష గొప్పదనాన్ని భావితరాలకు సజీవంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మాటల్లోనే కాదు, అక్షరాల్లోనూ తెలుగు భాష వైభవం తరతరాలకు నిలవాలని ఆయన ఆకాంక్షించారు. నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు తెలుగు చదవడం, రాయడంపై ఆసక్తి పెంచాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను పంచుకున్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో అక్షరంపై మమకారం, భాషపై అభిమానం పెంచితేనే మన తెలుగు లిపి భవిష్యత్తులోనూ వెలుగుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విడుదలైన 'కూల్‌ఫబెట్స్' యాప్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆటపాటల ద్వారా పిల్లలకు తెలుగుతో పాటు ఇతర భారతీయ భాషలను చదవడం, రాయడం నేర్పించే ఈ యాప్‌ను రూపొందించడం అభినందనీయమని అన్నారు. ఈ యాప్ రూపకర్తలైన కొల్లు రంజిత్, వెంకట్ ఏలేటితో పాటు వారి బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ యాప్‌లో వినియోగించిన సాంకేతికతను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ సహాయంతో పిల్లల చేతిరాతను పరిశీలించి, దాన్ని మెరుగుపరచడానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించేలా యాప్‌ను తీర్చిదిద్దడంపై హర్షం వ్యక్తం చేశారు. సాంకేతికత మన భాషను దూరం చేయకూడదని, దానికి మరింత చేరువ చేసే సాధనంగా మారాలని సూచించారు. "మన భాష, మన లిపి, మన సంస్కృతే మన తెలుగు జాతికి అసలైన గుర్తింపు. తేనెలొలికే మన తెలుగు భాష, భావితరాల్లోనూ చిరస్థాయిగా వెలుగొందాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తన పోస్టులో ఆకాంక్షించారు. సాంకేతికతను భాషాభివృద్ధికి వాడుకోవాలన్న ఆయన పిలుపుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర.. ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ




హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. భ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.


## గత ప్రభుత్వ హయాంలో బలవంతపు మత మార్పిడులు జరిగాయి

అమరావతి: గత ప్రభుత్వ హయాంలో బలవంతపు మత మార్పిడులు జరిగాయని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఓ మాజీ మంత్రి ఇంట్లోనే మత మార్పిడికి ఒత్తిడి జరిగిందని, ఆయన కోడలే ఈ విషయాన్ని బయటపెట్టిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అరకు పర్యటనలో 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఒక మాజీ మంత్రి కోడలు బయటకు వచ్చి, తనను ఇంట్లో మతం మారమని ఒత్తిడి చేస్తే తాను గట్టిగా నిరాకరించానని చెప్పింది. బయట హిందువులుగా చలామణి అవుతూ ఇంట్లో ఇలాంటి పనులు చేశారు. ఇది చాలా తప్పు. విశ్వాసం అనేది వ్యక్తిగతం, కానీ దాన్ని ఇతరులపై బలవంతంగా రుద్దడం దుర్మార్గం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత పాలనలో జరిగిన కొన్ని ఘటనలను కూడా ఆయన ప్రస్తావించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరిగాయని, ఆ పార్టీలో ఉండాలంటే మతమే ఒక కనీస అర్హతగా మార్చే పరిస్థితి తీసుకొచ్చారని చంద్రబాబు ఆరోపించారు. బలవంతపు మత మార్పిడులు మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. ఇటువంటి చర్యల వల్లే ప్రజలు గత ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఇటీవల మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత జోగి రమేశ్ కోడలు మేఘన మీడియా ముందుకు వచ్చి సంచలన ఆరోపణలు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## నేడు జూబ్లీహిల్స్ కో--ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ కో--ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 30న జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ స్కూల్‌లో పోలింగ్ జరగనుంది. బొల్లినేని రవీంద్రనాథ్, బొల్లినేని శీనయ్య ప్యానెళ్లు గట్టిగా పోటీ పడుతున్నారు. మొత్తం 4039 ఓట్లు ఉన్న ఈ సొసైటీ ఆసియాలోనే బెస్ట్ ఎలైట్ సొసైటీగా పేరొందింది. 1160 ఎకరాల విస్తీర్ణంలో ఈ కాలనీ ఉండగా 80 శాతం నివాసితులు కోటీశ్వరులుగా నమోదై ఉన్నారు. ఈ ఎన్నికల్లో పలువురు సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, వీవీఐపీలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపార దిగ్గజాలు ఓటు హక్కు వినియోగించుకోనున్నాయి. ఓటు హక్కు కలిగిన వారిలో సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సినీ హీరోలు చిరంజీవి, నాగార్జున, మహేష్‌బాబు, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్ పాటు నిర్మాత నాగవంశీ, ఏషియన్ మూవీస్ సునీల్ నారంగ్, జస్టిస్ చలమేశ్వర్, జ్యువెలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ కౌశిక్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, హెటిరో డ్రగ్స్ పార్థసారధి రెడ్డి, ఎంఎస్ఎన్ ఫార్మా అధినేత, దివీస్ ల్యాబ్స్ అధినేతతో, ప్రముఖ బిల్డర్లు డీఎస్ఆర్, జీవీపీఆర్, కేఎన్ఆర్‌లతో పాటు తాజా మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ప్రముఖ వ్యాపారులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ఓటు హక్కు కలిగి ఉన్నారు. 4039 మంది ఓటర్లలో 1656 మంది వీవీఐపీలు ఉన్నారు. ఇందులో 95 మంది మల్టీ మిలీయనర్లు ఉండగా 68 మంది భారతదేశ టాప్ 100 ధనవంతుల్లో ఉన్నవారు ఉన్నారు. ఈ ఎన్నికలు అత్యంత ఖరీదైనవిగా భావిస్తున్నారు.

## అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ: కొల్లు రవీంద్ర



ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి ఆంధ్రప్రదేశ్‌ను క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. భారతదేశానికే ఆదర్శంగా రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ 'స్పోర్ట్స్ సిటీ'తో పాటు 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడానికి పీవీ సింధు, పుల్లెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖ క్రీడాకారుల అకాడమీలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని రికార్డు సృష్టించారని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు. రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రాన్ని వైజాగ్, అమరావతి, తిరుపతిగా 3 జోన్లుగా విభజించినట్లు తెలిపారు. క్రీడా పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నెల్లూరు పరిసర ప్రాంతాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు సీఎస్ఆర్ నిధులతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు క్రీడా సదుపాయాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు.

